క్లుప్తంగా

బీఎల్‌ఓల ద్వారా ఓటరు స్లిప్పులు

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ స్లిప్‌లను అందిస్తామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తి చేకూరి తెలియజేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో, పశ్చిమ నియోజకవర్గ ఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌ఓల ద్వారా ప్రతి ఓటర్‌కు ఓటు స్లిప్ అందిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎవరైనా ఓటర్ల స్లిప్‌లు ఇవ్వాలి అంటే సదరు స్లిప్‌లో ఏ విధమైన రాజకీయ ప్రచారాలు చేయకూడదని, స్లిప్‌లో రాజకీయ పార్టీల గుర్తులు, రంగులు ఉండకూడదని తెలిపారు. ఏఆర్‌ఓలు సునీల్, భీమరాజు, మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మ, కె.దివాకర్ రెడ్డి, గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌పై అవగాహన అవసరం..

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో పీడబ్ల్యూడీ(హోం ఓటింగ్) ఓట్లపై బీఎల్‌ఓలు, సెక్టార్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తి చేకూరి చెప్పారు. సోమవారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో బీఎల్‌ఓలు, సూపర్వైజర్లు, సెక్టార్, రూట్ అధికారులతో హోం ఓటింగ్, ఓటింగ్ శాతం పెంపు, ఇతర ఎన్నికల విధులపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతనంగా అమలు చేయనున్న పర్సన్ విత్ డిజేబుల్ (హోం ఓటింగ్) పై ప్రతి బీఎల్‌ఓ, సెక్టార్ అధికారి సమగ్ర అవగాహన కల్గి ఉండాలన్నారు. హోం ఓటింగ్ కు ఎంపిక చేసిన వారి వివరాలు ఫారం 12 డి ద్వారా రిటర్నింగ్ అధికారికి ముందుగానే అందించాలని, ఓటింగ్ కి సంబంధించి స్థానిక పిఓ, మైక్రో అబ్జర్వర్, మరొక పీఓ, వీడియోగ్రాఫర్ సమక్షంలోనే జరుగుతుందని తెలిపారు.

వ్యాపారస్తులకు అండగా ఉంటాం

- వైద్యఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే మద్దాళి గిరితో కలిసి వాసవీ క్లాత్ మార్కెట్‌లో ప్రచారం



గౌతమినగర్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం



వాసవీ క్లాత్ మార్కెట్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నెహ్రూనగర్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యాపారులకు ఎల్లప్పుడూ అండగా నిలిచిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌లు పేర్కొన్నారు. గుంటూరు నగరంలో తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు చెందిన ఆర్యవైశ్యులు వ్యాపారాలు నిర్విహించుకునే అతి పెద్ద క్లాత్ మర్చంట్ అయిన వాసవీ క్లాత్ మార్కెట్ కాంప్లెక్స్‌లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యాపారస్తులను ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేసి వారిని ఆర్థికంగా కుంగదీశారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వ్యాపారస్తులు బాగుంటే రాష్ట్రం బాగుంటుందనే ఉద్దేశంతో వారి అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారని కొనియాడారు.

ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి రజిని..

నెహ్రూనగర్: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విడదల రజిని, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంతో కలిసి పశ్చిమ నియోజకవర్గంలోని గౌతమినగర్‌లో నిర్మించిన చర్చి ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం చర్చి పాస్టర్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, ఆశీర్వచనం తీసుకున్నారు. స్థానిక కార్పొరేటర్ వంగల హేమలత, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రగిరి ధీరజ్, ఏటిగడ్డ వాసు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాహితీవేత్త శ్రీనివాసరావుకు ఉగాది పురస్కారం

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో సోమవారం క్రోధి నామ సంవత్సర ఉగాది ఉత్సవాలను నిర్వహించారు. సాహితీవేత్త డాక్టర్ నందనవనం శ్రీనివాసరావుకు 'సహస్రాధిక ప్రసంగ పరమేశ్వర' బిరుదు ప్రదానం చేసి, సత్కరించారు.

రైలులో 8 కిలోల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయితో సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్సైలు

లక్ష్మీపురం: రాయఘడ్ నుంచి గుంటూరు వైపు వచ్చే ఎక్స్‌ప్రెస్ రైలు(17244) జనరల్ బోగీలో ఎనిమిది కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకుని గుంటూరు రైల్వే జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం రాయఘడ్ నుంచి గుంటూరు వైపు వచ్చే రైలులో గుంటూరు రైల్వే స్టేషన్ ఫ్లాట్‌ఫారం 6లో రైల్వే క్లీనింగ్ సూపర్‌వైజర్ సునీల్ జనరల్ బోగీలు శుభ్రం చేస్తున్నాడు. ఈసమయంలో బోగీలో రెండు బ్యాగులు ఉండటం గమనించి వెంటనే జీఆర్పీ సీఐ, పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు రమేష్, వెంకటాద్రిలు సిబ్బందితో వెంటనే ప్లాట్‌ఫామ్‌కు చేరుకుని బ్యాగులు తనిఖీ చేయగా, సుమారు రూ. 50వేలు విలువ చేసే 8 కేజీల గంజాయి లభ్యమైంది. పోలీసులు గంజాయి బ్యాగులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ ఆదేశాల మేరకు గుంటూరు రైల్వే డీఎస్పీ నాగేశ్వరరావు సూచనలతో రైల్వే స్టేషన్‌లలో తనిఖీలు ముమ్మరం చేయడం జరిగిందన్నారు. గుంటూరు రైల్వే పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మాదకద్రవ్యాలు, స్మగ్లింగ్ చేసేవారిని పట్టుకునేందుకు ఆర్పీఎస్ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచినట్లు వెల్లడించారు.

ఐఎన్‌టీఎస్ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులతో ఏజీఎం అంజయ్య, ఆర్‌ఐలు, కో–ఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్స్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్‌వో) లో శ్రీచైతన్య స్కూల్స్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు సంస్థ ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య తెలిపారు. రింగ్‌రోడ్డులోని శ్రీచైతన్య కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో ఏజీఎం అంజయ్య మాట్లాడుతూ ఐఎన్‌టీఎస్‌వోలో గుంటూరు జిల్లాలోని శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని తెలిపారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రతిభావంతులు గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఇటీవల యూఎస్ఏలోని నాసా నిర్వహించిన స్పేస్ కాంటెస్ట్‌లో శ్యామలానగర్, గుంటూరు రెసిడెన్షియల్, తెనాలి, బాపట్ల క్యాంపస్‌ల నుంచి ఆరు ప్రాజెక్టులతో శ్రీచైతన్య విద్యార్థులు అంతర్జాతీయస్థాయి ప్రతిభ చూపినట్లు వివరించారు. అదే విధంగా తాజాగా ఐఎన్‌టీఎస్‌ఓలో గుంటూరు జిల్లా నుంచి ఐదుగురు విద్యార్థులు గ్రాండ్ ప్రైజ్‌గా ల్యాప్‌టాప్‌తో పాటు 13 మంది ట్యాబ్‌లను కైవసం చేసుకున్నారని వివరించారు. వీరితో పాటు 201 మంది విద్యార్థులు తరువాతి స్థానాల్లో నిలిచారని వివరించారు. ఆర్‌ఐలు అప్పాజీ, సీహెచ్ సురేంద్ర, అకడమిక్ కో–ఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్స్, డీన్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాపులను అవమానపరిచిన పెమ్మసాని

టీడీపీ ఎంపీ అభ్యర్థిపై సోషల్ మీడియా వేదికగా మండిపడిన పీవీఆర్ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు సంకట లక్ష్మణరావు



కాపుల ఆత్మీయ సమావేశంలో పెమ్మసాని మాట్లాడుతున్న సమయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

నెహ్రూనగర్: టీడీపీ కాపుల ఆత్మీయ సమావేశం అని చెప్పి కాపు సంఘాల నాయకులను మాట్లాడనివ్వకుండా కేవలం టీడీపీలో ఉన్న కాపుల చేత మాట్లాడించి.. కాపు సంఘాల నాయకులు టీడీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ కాపు సంఘాల నాయకులను తీవ్రంగా అవమానించారని పీవీఆర్ కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు సంకట లక్ష్మణరావు సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని ఆధ్వర్యంలో కాపుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అన్ని పార్టీల్లో ఉన్న కాపు నేతలు, కాపు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఆ సమావేశంలో కేవలం టీడీపీలో ఉన్న కాపు నేతలతో మాట్లాడించి కాపు సంఘ నాయకులను మాట్లాడనివ్వకపోవడంపై లక్ష్మణరావు మండిపడ్డారు.. టీడీపీలో కాపులకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పుకుందామని వచ్చిన తమకు కనీసం మాట్లాడనివ్వకుండా టీడీపీలోని కాపులు మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కాపులకు ఏం చేస్తుందో చెప్పకుండా.. పెమ్మసానిని పొగిడే విధంగా కాపు నేతలు మాట్లాడంపై నిప్పులు చెరిగారు. ఇది కేవలం పెమ్మసానికి భజన చేసే సభగా ఆయన అభివర్ణించారు. ఈ సమావేశంతో కాపులకు అవమానం జరిగిందన్నారు. కాపులకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకునే వీలు లేకుండా చేశారంటే ఈ మీటింగ్ సారాంశాన్ని కాపులంతా గ్రహించాలని, పెమ్మసానికి కాపుల ఓట్లు పడవనే భయంతోనే కాపు సంఘాల నాయకుల్ని పిలిచి మాట్లాడనివ్వలేదన్నారు. పెమ్మసాని భజనే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ మీటింగ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని లక్ష్మణరావు పేర్కొన్నారు.

నాక్ ఏర్పాట్లను పరిశీలించిన నిపుణుల బృందం



వీసీ ఆచార్య పి.రాజశేఖర్, యూనివర్సిటీ ఉన్నతాధికారులతో చర్చిస్తున్న నిపుణుల కమిటీ సభ్యులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో త్వరలో జరగనున్న నాక్ బృందం పర్యటనకు సంబంధించి యూనివర్సిటీలో జరుగుతున్న ఏర్పాట్లను పలు యూనివర్సిటీల మాజీ వీసీలతో కూడిన నిపుణుల బృందం సోమవారం పరిశీలించింది. ఏఎన్‌యూ మాజీ వీసీ ఆచార్య కె.వియ్యన్నారావు, జేఎన్‌టీయూకే మాజీ వీసీ ఆచార్య వీవీఎస్ కుమార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జి.మోహనరావు, యోగి వేమన యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ఎ.రామచంద్రారెడ్డిలతో కూడిన నిపుణుల (మాక్ టీమ్) సభ్యులకు వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణలు స్వాగతం పలికారు. అనంతరం యూనివర్సిటీ సమగ్ర నివేదిక, అభివృద్ధి అంశాలతో వీసీ కమిటీకి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఆయా విభాగాల్లో చేపట్టాల్సిన అధనపు ఏర్పాట్లపై విభాగాధిపతులకు కమిటీ సూచనలు చేసింది.

నేడు ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులతో సమావేశం

నాక్ ఏర్పాట్లపై చర్చించేందుకు యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, కో–ఆర్డినేటర్లతో మంగళవారం యూనివర్సిటీ ఉన్నతాధికారులు సమావేశం నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీ పరిపాలనా భవన్‌లోని కమిటీ హాలులో ఉదయం 11.30 గంటలకు సమావేశం జరుగుతుంది.

మెట్టు సత్యనారాయణరెడ్డి మృతికి నివాళి



సత్యనారాయణ రెడ్డి (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: కొండవీడు ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వహణలోని శ్రీగొర్ల హనిమిరెడ్డి–మెట్టు చిన మల్లారెడ్డి జూనియర్ కళాశాల (రెడ్డి కాలేజీ) అధ్యక్షుడు మెట్టు సత్య నారాయణరెడ్డి సోమవా రం మరణించారు. విద్యాసంస్థల అభివృద్ధికి విశేషమైన సేవలతో పాటు ఎంతోమంది పేద విద్యార్థులకు ఆయన తమ కళాశాలల ద్వారా విద్యను అందించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు సొంత నిధులతో ఉపకార వేతనాలు అందించి, ప్రోత్సహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మహాత్మాగాంధీ కళాశాల చైర్మన్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం, రెడ్డి బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌తో పాటు పలువురు ప్రముఖులు ఆయన పార్థీవ దేహానికి నివాళులర్పించారు.

ఐజీని కలిసిన పల్నాడు ఎస్పీ



ఐజీ త్రిపాఠికి మొక్క అందిస్తున్న పల్నాడు ఎస్పీ బిందు మాధవ్

నగరంపాలెం: గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని పల్నాడు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం గుంటూరులోని ఐజీ కార్యాలయంలో ఐజీ త్రిపాఠిని కలిసి, మొక్క అందించారు. పల్నాడు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ బిందు మాధవ్‌కు ఐజీ సూచించారు.

క్లుప్తంగా

సమన్వయంతో పనిచేయాలి

కొండపాటూరు(కాకుమాను): ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న స్వయంభూ శ్రీ కొండ పాటూరు పోలేరమ్మ తల్లి తిరునాళ్లను అధికారులందరు సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ పార్వతి అన్నారు. మండలంలోని కొండపాటూరులో వేంచేసి ఉన్న స్వయంభు శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల ఏర్పాట్లపై సోమవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తిరునాళ్ల మహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి అధికారి తిరునాళ్ల జరిగే మూడు రోజులు అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు. పొన్నూరు సెబ్ సీఐ సుకన్య, ఎస్ఐ ఎస్.రవీంద్ర, దేవాలయ ఈఓ సురేష్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పొన్నూరు: పోలింగ్ కేంద్రా లకు వెళ్లలేక ఓటుహక్కును వినియోగించుకోలేని దివ్యాంగులు, వృద్ధులు 85 ఏళ్లు నిండిన వారి సౌక ర్యార్థం ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకు నే అవకాశం కల్పించినట్లు ఆర్వో లక్ష్మీకుమారి తెలిపారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడా రు. నియోజకవర్గంలో 3922 మందిని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఇప్పటివరకు సి విజిల్ ద్వారా 28 ఫిర్యాదులు అందగా వాటిలో 21 ఫిర్యాదులను పరిష్కరించినట్లు అన్నారు. సువిధ యాప్‌లో అనుమతుల కోసం 92 దరఖాస్తులు అందగా, వాటిలో 51 అనుమతులు ఇచ్చినట్లు, 28 దరఖాస్తులు తిరస్కరణకు గురై, 13 పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఫిర్యాదులపై 08643-242080, 297823 నెంబర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో లాయర్ మృతి

పెదకాకాని: జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో నంబూరు కోటేశ్వరరావు అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. వివరాల మేరకు.. మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన నంబూరు కోటేశ్వరరావు న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎక్కువ సమయం మంగళగిరి కోర్టులో పనిచేస్తుంటారు. గుంటూరు కోర్టులో పనులపై వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో స్కూటీపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలోకి చేరుకున్నాడు. జాతీయ రహదారిపై ఆయనను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నంబూరు కోటేశ్వరరావు(44) తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శ్యామల, లహరి, అవంతిక ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఇళ్ల వద్దకు ఫారం 12డీ దరఖాస్తులు

తహసీల్దార్ ఎం. పద్మజ



ప్రత్తిపాడు: ఇంటి వద్ద నుంచే 85 సంవత్సరాలు నిండిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం. పద్మజ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ బీఎల్ఓలతో హోం ఓటింగ్ విధానంపై సమావేశాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 85 సంవత్సరాలు నిండిన ఓటర్లతో పాటు పీడబ్ల్యూడీ ఓటర్లు ఇంటి నుంచే ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా వినియోగించుకోవచ్చని చెప్పారు. విషయాన్ని గ్రామాల్లో ఉన్న 85 ఏళ్లు నిండిన ఓటర్లు, పీడబ్ల్యూడీ ఓటర్లు వద్దకు బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఆసక్తి ఉన్న వారికి 12డీ దరఖాస్తులు అందజేయాలని సూచించారు. హోం ఓటింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలనుకునే వారికి మే నెలలో నిర్ణీత తేదీలలో స్పెషల్ ఓటింగ్ టీంల ద్వారా పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పిస్తారని పద్మజ వివరించారు. బీఎల్ఓలు, సూజర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ

మంగళగిరి: రోడ్ల వెంట చెప్పులు కుట్టుకునే వారు, కొబ్బరి బోండాలు, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారికి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జంబో గొడుగులు పంపిణీ చేశారు. సోమవారం నిడమర్రు రోడ్డులోని అరవింద స్కూలు ఆవరణలో నిర్వహించిన గొడుగుల పంపిణీ కార్యక్రమంలో సొసైటీ జిల్లా చైర్మన్ రామచంద్రరావు, తెనాలి చైర్‌పర్సన్ ఎం.భానుమతి, డీఎస్పీ మహబూబ్ బాషా, ట్రెజరర్ రవి శ్రీనివాస్, మంగళగిరి చైర్మన్ అనిల్ చక్రవర్తి, వైస్ చైర్మన్ గాజుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో దుర్గామాత

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని విజయ దుర్గా మాత ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మూడో రోజు సోమవారం ఉదయాన్నే ఆలయ అర్చకులు వి.రాజేంద్రశర్మ అమ్మకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి కుంకుమ పూజలు చేశారు. మూడు రోజులుగా వేదపండితులు నిర్వహిస్తున్న గణపతి, చండీ హోమాలు సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వి.శివయ్య పర్యవేక్షించారు.

తారెత్తిస్తున్న సూరీడు

- రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- మే నెల ముందే వచ్చిందా అన్నట్లుగా నమోదు
- ఎండవేడిమికి తోడైన వడగాడ్పులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



గుంటూరు మెడికల్: ఏటికేటికీ ఎండా కాలం ముందుకు జరుగుతున్నట్లు వాతావరణం కనిపిస్తోంది. మే నెలలో కాయాల్సిన ఎండలు ముందే పలకరిస్తున్నాయి. వీటికి తోడు వేడిగాలులు ప్రజాజీవనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. భూ తాపం కారణంగా సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ చెబుతోంది. ముఖ్యంగా వచ్చే నాలుగురోజుల్లో సాధారణం కంటే నాలుగు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగే సూచన ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ ముందస్తు సూచికలు జారీ చేసింది. వేసవిలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ తగిలి ప్రాణాలు పోయే ప్రమాదముంది.



డాక్టర్ నరేంద్ర వెంకటరమణ

వడదెబ్బను ఇలా గుర్తించండి..

మానవ శరీరంలో జరిగే అన్ని జీవ క్రియలకు మూలం జలం. శరీరంలో సాధారణ ఉష్ణోగ్రత 37 డిగ్రీలు (98.6 ఫారెన్‌హీట్). బయటి వాతావరణంలో ఉష్ణోగ్రత 37 డిగ్రీలు దాటినప్పుడు మన శరీరం ఎండ ప్రభావానికి లోనవుతుంది. అప్పుడు ఉక్కపోతగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఆ సమయంలో దేహం చల్లబడేందుకు అసంకల్పిత ప్రతీకార చర్యగా నీరు బయటకు వచ్చి సమతా స్థితిని చేరుకుంటుంది. ఒకవేళ చెమట బయటకు రాకున్నా శ్వేద గ్రంథుల ద్వారా నీరు ఆవిరి అవుతూనే ఉంటుంది. దీనిని మనం గుర్తించలేం. ఇలా బయటకు వెళ్లిన నీటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాల్సిందే. ఆలస్యమయితే జీవక్రియలు మందగించి వడదెబ్బకు దారితీస్తుంది.

వడదెబ్బ లక్షణాలు..

తలనొప్పి, తల తిరగటం, శరీరంలో నీరంతా పోవడం, పొడిబారిన చర్మంతో ఎక్కువ జ్వరం వస్తుంది. మత్తునిద్ర, కలవరింతలు ఆవహిస్తాయి. వేడి తీవ్రత 106 డిగ్రీల దాటగానే ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉంది. ఫలితంగా పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవచ్చు. రక్తపోటు (బీపీ) పూర్తిగా తగ్గిపోతుంది. మెదడు, మూత్రపిండ వ్యవస్థ స్తంభించిపోతుంది. మూత్రం ఆగి ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుంది.

ప్రథమ చికిత్స ఇలా...

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి చేర్చాలి.
- బాధితుడి శరీరంపై దుస్తులను తొలగించి చల్లని నీటి గుడ్డతో తుడవాలి
- మంచు ముక్కలను గుడ్డలో ఉంచి శరీరం అంతా అద్దితే చాలా మంచిది
- చల్లని గాలి తగిలేలా చూడాలి

ఏప్రిల్ నెల ఉష్ణోగ్రతల వివరాలు

తేదీ	డిగ్రీలు
1	39
2	39
3	38
4	38
5	39
6	42
7	41
8	39

- చల్లని నీరు, ఉప్పు, ఇతర లవణాలు కలిపిన నీటిని తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి నీరు తాగించవద్దు. అయితే ఈ చర్యలన్నీ వైద్యున్ని సంప్రదించేలోగా చేయాల్సిన ప్రథమ చికిత్స చర్యలే.
- స్పృహ కోల్పోతే మాత్రం సమయం వృథా చేయకుండా వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టాలి.

వడదెబ్బకు దూరంగా ఉండాలంటే...

- సాధ్యమైనంత వరకు మిట్ట మధ్యాహ్నం ఎండలో తిరగకుండా జాగ్రత్త పడాలి ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లల్లోనే ఉండటం శ్రేయస్కరం
- తప్పని సరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ, పళ్ల రసాలు, చల్లని నిమ్మరసం, కొబ్బరి నీరు, మంచినీటిని తీసుకెళ్లాలి. గొంతు తడారకుండా అప్పుడప్పుడు తీసుకోవాలి
- తెల్లని దుస్తులు ధరించాలి. బాగా వదులుగా ఉండే కాటన్ వస్త్రాలు ధరిస్తే మంచిది. నల్లని వస్త్రాలను వేసుకోకపోవడం ఉత్తమం
- ఇంటి గదుల ఉష్ణోగ్రత తగ్గించేందుకు కిటికీలు, తలుపులకు తెరలను వాడితే వేడి తీవ్రతను అరికట్టవచ్చు. ఫ్యాన్లు, ఎయిర్‌కూలర్లు, ఎయిర్ కండీషనర్లు వాడాలి.
- చల్లని ప్రదేశాల్లో ఉండేందుకు ప్రయత్నించాలి
- వేడిగా ఉన్న రోజులలో గొడుగు, టోపీ వాడాలి. కనీసం తలకు రుమాలైన కట్టుకోవాలి
- శరీరం నుంచి చెమట రూపంలో నీరు అధికంగా బయటకు పోతుంది. కాబట్టి సాధ్యమైనంత మేర మంచినీరు తరచూ తాగుతుండాలి. రోజుకు కనీసం ఐదారు లీటర్ల నీటిని తీసుకోవాలి
- పొలం పనులను ఉదయం, సాయంత్రం వేళల్లోనే చూసుకోవాలి

అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాం



ఎండల తీవ్రత దృష్ట్యా ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను, సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాం. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలు ఎండ ప్రభావానికి గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాం. వడదెబ్బ బాధితులకు వైద్యం అందించేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాలు, చలి వేంద్రాల్లో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల దగ్గర ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, యాంటీ డయేరియల్ మందుల్ని అందుబాటులో ఉంచాం.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

నగరంలో ఉగాది శోభ





కొనుగోలుదారులుతో కిక్కిరిసిన బస్టాండ్‌లోని రైతు బజార్, పూలమార్కెట్

- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు
- కొనుగోలుదారులతో కిటకిటలాడిన మార్కెట్లు

పాతగుంటూరు: ఉగాది పర్వదిన వేడుకలకు నగరంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. మంగళవారం ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు నగరవాసులు సిద్ధమయ్యారు. ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు తరలిరానుండటంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు. అలాగే పలు ఆలయాల్లో పురోహితులు పంచాంగ శ్రవణం చేయనున్నారు. ఆలయ ప్రాంగణాల్లో వేదికలు సిద్ధం చేశారు. పలు వేదికలపై ఉగాది పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. వ్యాపార సంస్థలు, కార్యాలయాలు, ఆలయాలను మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు, అరటి బోదెలతో అలంకరించారు. పండుగ పురస్కరించుకుని సోమవారం నగరంలోని మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా బస్టాండ్ రైతుబజార్లోని పూల మార్కెట్ కిక్కిరిసింది. పంచాంగ పుస్తకాల విక్రయ దుకాణాల వద్ద సందడి నెలకొంది.

జీజీహెచ్‌లో మూడు మందుల పంపిణీ కేంద్రాలు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి గుండె జబ్బుల ఓపీ విభాగం మందులు ఇచ్చే కేంద్రం వద్ద రోగుల కోసం మూడు మందుల కేంద్రాలను ప్రారంభించినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ సోమవారం చెప్పారు. గుండె జబ్బుల ఓపీ వద్ద రోజు రోజుకు రోగులు పెరిగిపోతున్నారని, వారికి అవసరమైన మందుల కేంద్రాలను ఎక్కువగా ప్రారంభించాలన్న ఉద్దేశ్యంతో మూడు కేంద్రాలను అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు.

న్యూరాలజీ వార్డుకు మూడు వెంటిలేటర్లు వితరణ..

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి న్యూరాలజీ వార్డుకు మూడు వెంటిలేటర్లను అందజేస్తునట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ కుమారికి మూడు వెంటిలేటర్లను సైరెక్స్ సంస్థ సహకారంతో అందచేసినట్లు వెల్లడించారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజూ 30 నుంచి 40 మందికి పైగా సీరియస్‌గా ఉన్న రోగులు ఆసుపత్రికి వస్తున్నారని చెప్పారు. వెంటిలేటర్ల ఆవశ్యకత గురించి తెలుసుకుని స్ట్రోక్ యూనిట్‌తో పాటు న్యూరాలజీ వార్డుకు మూడు వెంటిలేటర్లను అందించామని తెలిపారు. ప్రస్తుతం ఐదు వెంటిలర్ల సహాయంతో రోగుల ప్రాణాలను కాపాడుతున్నారని, మరో మూడు ఉన్నట్లయితే రోగులకు సౌలభ్యంగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో అందించామని చెప్పారు. న్యూరాలజీ విభాగాపతి డాక్టర్ అరుణ కుమారి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టర్ అరుణకుమారికి వెంటిలేటర్లు అందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

ఘనంగా ఉగాది సంబరాలు



షేక్ అస్మతున్నీసాకు కాంస్య నంది, సాహితీ విద్యారత్న బిరుదుతో సత్కారం



బెల్లంకొండ వెంకట్‌కు 'కళాభూషణ్' బిరుదు ప్రదానం

తెనాలి: పద్మభూషణ్ గుర్రం జాషువా కళా సమితి ఆధ్వర్యంలో ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కవిరాజు పార్కులోని వీజీకే భవన్‌లో ఆదివారం రాత్రి పొద్దుపోయేంత వరకు ఈ వేడుకలు జరిగాయి. వివిధ సాంస్కృతిక ప్రదర్శనల అనంతరంర వివిధ రంగాల్లోని ప్రముఖులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు.

స్థానిక ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలు తెలుగు ఉపాధ్యాయిని, కవయిత్రి డాక్టర్ షేక్ అస్మతున్నీసాకు ఉగాది పురస్కారంగా కాంస్య నంది, సాహితీ విద్యారత్న బిరుదు బహూకరించారు. ఇదే వేదికపై ప్రముఖ చిత్రకారుడు, కళాకారుడు డాక్టర్ బెల్లంకొండ వెంకట్‌కు 'కళా భూషణ్' బిరుదుతో ఉగాది పురస్కారం జేశారు. పద్మభూషణ్ గుర్రం జాషువా కళాసమితి జాతీయ చైర్మన్ పెద్దేటి యోహాను ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, డాక్టర్ రంగిశెట్టి రమేష్, పలువురు ఉపాధ్యాయులు, కళాకారులు పాల్గొన్నారు.

ప్రతి బూత్‌లో వసతులు క్షుణ్ణంగా పరిశీలించాలి

మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ రాజకుమారి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

తాడేపల్లిరూరల్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి, ప్రతి బూత్‌లోను మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా సౌకర్యాలు కల్పించాలని మంగళగిరి రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా సంయుక్త కలెక్టర్ రాజకుమారి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లిలో పోలింగ్ బూత్‌లను సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అన్ని శాఖలను సమన్వయం చేసుకుని తాగునీటి సౌకర్యం, క్యూ లైన్ల ఏర్పాటు, ఫ్యాన్లు ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ రోజున ఓటర్లకు కావలసిన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఆమె వెంట ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్, మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ ఎలక్ట్రోల్ అధికారి బిక్కిరెడ్డి శివారెడ్డి, ఏఈ కిషోర్ ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

తాడికొండ రిటర్నింగ్ అధికారి గంగరాజు



మాట్లాడుతున్న గంగరాజు

తాడికొండ: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణాధికారి ఎం.గంగరాజు పేర్కొన్నారు. సోమవారం తాడికొండ షిరిడి సాయి పర్తిసాయి మందిర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీలు, బీఎల్‌ఓలు, ఎన్నికలాధికారుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రశాంత పోలింగ్ నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని, గ్రామాల్లో వివాదాలకు తావు లేకుండా సఖ్యతగా వ్యవహరించాలని కోరారు. కక్ష పూరితంగా వ్యవహరించడం, అల్లర్లు సృష్టించడం వంటివి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రౌడీషీటర్లు, వివాదాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసు శాఖ నిఘా ఉంటుందని చెప్పారు. ఏమైనా ఇబ్బందికర పరిస్థితులు గ్రామాల్లో ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల నిబంధనలు కఠినతరంగా ఉంటాయి కనుక అధికారులు కూడా నిబంధనల మేరకు మాత్రమే నడుచుకోవాలని, రాజకీయ పార్టీలకు, కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఉద్యోగులు రాజకీయ పార్టీలకు కొమ్ముకాసినట్లు తెలిస్తే సస్పెన్షన్ వేటు పడుతుందని, దాని ప్రభావం వలన తిరిగి విధుల్లో చేరాలంటే ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుంది కనుక అప్రమత్తంగా వ్యవహరించాలని ఉద్యోగులకు సూచించారు. పోలింగ్ స్టేషన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పరిసర ప్రాంతాల్లో రాళ్ల కుప్పలు, కర్రలు వంటివి అందుబాటులో లేకుండా చూడాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకొని వివాదాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మదుసూధన రావు, సీఐ సీహెచ్ ప్రభాకర్, ఎంపీడీఓ అనూరాధ, డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి అంకమ్మతల్లి ప్రతిష్టా మహోత్సవాలు



ముస్తాబైన అంకమ్మతల్లి దేవాలయం

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో అంకమ్మతల్లి దేవాలయ ప్రతిష్టా మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. 9వ తేదీ ఉగాది పర్వదినం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు 12 తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాల్లో తొలిరోజైన మంగళవారం గ్రామంలో కొలువై ఉన్న అన్ని ఆలయాల సందర్శన, సకల దేవతామూర్తులకు తాంబూల సహిత వస్త్ర బహూకరణ, 10వ తేదీ ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, రక్షాబంధనం, వాస్తుపూజ, అగ్నిమథనం, అగ్నిస్థాపన, హోమం, యంత్ర నమస్కారాలు, మంత్రం జపనుష్టములు, యజ్ఞశాల ప్రవేశం, అఖండస్థాపన, మృత్యం గ్రహణం, అంకురార్పణం, సాయంత్రం పోతురాజుల కొలువులతో మాతంగి వేషధారణలతో కొమ్ముడప్పుల నృత్యాలతో అంకమ్మతల్లి గ్రామోత్సవం, రాత్రి జలాధీశం నిర్వహించనున్నారు. 11న క్షీరాధివాసం, పంచామృతాధివాసం, నవగ్రహ ఆరాధన, ప్రధాన కలశ వాహన, సౌలార్చన, క్షీర తర్పణం, న్యాసకళ, 12వ తేదీన రత్నన్యాసం, ధాతున్యాసం, యంత్రస్థాపన, కలశ ప్రతిష్ట, అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట, త్రిశూల స్వామి విగ్రహ ప్రతిష్ట, శ్రీ పోతురాజు స్వామి ప్రతిష్టా కార్యక్రమాలు జరగనున్నాయి. అనంతరం మహాదాన కూష్మాండబలి, మహా కుంభాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదురుగానున్న మైదానంలో మహా అన్నప్రసాద కార్యక్రమం జరగనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి



ప్రత్తిపాడు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో యువకుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ముట్లూరు దళితవాడకు చెందిన నక్క సుబ్బయ్య కుమారుడు నక్క అలెక్స్ (24) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల తన తండ్రి సుబ్బయ్యకు ఆరోగ్య సమస్య లు తలెత్తడంతో, కుమారుడు స్వగ్రామమైన ము ట్లూరుకు వచ్చి ఇక్కడే తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం తమ ఇంట్లో ఉన్న నీటి మోటారు పనిచేయకపోవడంతో అలె క్స్ మరమ్మతులు చేస్తున్నాడు. అదే సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో అలెక్స్ అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

నేటి నుంచి వసంత నవరాత్రోత్సవాలు

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై వసంత నవరాత్రోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో 17వ తేదీ వరకు క్రోధి నామ సంవత్సర వసంత నవరాత్రోత్సవములు నిర్వహించనున్నామని చెప్పారు. ఉగాది పండుగ సందర్భంగా ఉదయం 8 గంటలకు అభిషేక మహోత్సవం, 11 గంటలకు క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణం, 17వ తేదీ ఉదయం 9.30 గంటలకు శ్రీ సీతారామచంద్రులకు కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని ఆ ప్రకటనలో కోరారు.

కోదండరామునిగా నృసింహస్వామి

మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి కోదండరామునిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

ఉపాధ్యాయినులకు పురస్కారాలు



తెనాలిఅర్బన్: విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లీడ్ స్కూల్ విధానమని ఆ సంస్థ రాష్ట్ర రీజనల్ డైరెక్టర్ బి.సుబ్రమణ్యం పేర్కొన్నారు. లీడ్ స్కూల్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 14 మంది ఉపాధ్యాయినులకు జాతీయ పురస్కారాలను సోమవారం బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మూడువేలకు పైగా పాఠశాలలు లీడ్ స్కూల్ విధానాన్ని అవలంబిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, లీడ్ స్కూల్ జిల్లా అకాడమీ మేనేజర్ బి.వి.సుధాకర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండల గ్రామం నందివెలుగులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కట్టా రాజ్యలక్ష్మి(45) తన ఎలక్ట్రిక్ స్కూటర్‌పై నందివెలుగు జంక్షన్ వైపు వెళుతుండగా ఎదురుగా వచ్చిన ట్రక్కు ఆటో ఢీ కొట్టడొంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

తెనాలి: కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతీ యువకులంతా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటును వినియోగించుకోవాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు సూచించారు. స్థానిక శ్రీచైతన్య జూనియర్ కాలేజిలో సోమవారం కౌన్సిల్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పల్నాటి నాగరాజు మాట్లాడుతూ సామాన్యులకు ఓటు హక్కు వజ్రాయుధమని చెప్పారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో ఉందని, అందరికీ ఓటు, ఎన్నికలు, ప్రజాస్వామ్యంపై అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. గత నెలలో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు శ్రీచైతన్య జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ నన్నపనేని సునీల్ సర్టిఫికెట్లను అందజేశారు. బోర్డ్ ప్రిన్సిపాల్ మాల్యాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణలో భాగస్వాములు కావాలి

తెనాలిఅర్బన్: దోమల నియంత్రణకు తీసుకునే చర్యల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల కోరారు. ఐతానగర్‌లోని జయప్రకాష్‌నగర్‌లో సోమవారం మలేరియా, ఫైలేరియా సిబ్బంది నిర్వహించిన ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న మురుగుకాల్వలు, కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వలన దోమల వ్యాప్తి పెరుగుతుందని చెప్పారు. దోమ కాటువలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అందరూ డ్రై డేగా పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో పాత వస్తువులను శుభ్రం చేసుకోవాలని, అలాగే నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలు ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సిబ్బంది దాసరి మల్లేశ్వరరావు, బండారు మల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.